ప్రజాశక్తి
శనివారం 18 జనవరి 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

కార్పొరేషన్.. కరెప్షన్..!

- గుప్పుమంటున్న అవినీతి
- మేయర్ వర్సెస్ కమిషనర్
- రోజురోజుకూ పెరుగుతున్న వివాదం
- కౌన్సిల్ సమావేశం ఇప్పట్లో లేనట్టేనా?



ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్‌లో అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గత నెల రోజులుగా ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. రోజురోజుకూ వివాదాలు పెరుగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కమిషనర్‌పై మేయర్, డిప్యూటీ మేయర్, వైసిపి కార్పొరేటర్లు అవినీతి ఆరోపణలు చేశారు. ఇందుకు ప్రతిగా అధికారులు కూడా గత నాలుగేళ్లలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ చేయాలని టిడిపి కార్పొరేటర్లు కమిషనర్‌పై వత్తిడి పెంచారు. ఈ మేరకు కమిషనర్ గత నాలుగేళ్లుగా జరిగిన అవినీతిపై దృష్టి సారించడం వల్లనే మేయర్, డిప్యూటీ మేయర్ బుడమేరు వరద సాయంలో అవినీతి జరిగిందంటూ కొత్త అంశాలు తెరపైకి తెచ్చారని టిడిపి కార్పొరేటర్లు వ్యాఖ్యానించారు.

నగర కమిషనర్‌గా పనిచేసిన ఐఎఎస్ అధికారి చేకూరి కీర్తి హయాంలో అడ్డగోలుగా బిల్లులు పెడితే తిరస్కరించే వారు. ఆమె బదిలీ అయ్యే నాటికి రూ.60 కోట్ల వరకు నిధులు కార్పొరేషన్‌లో ఉండగా ఆమె స్థానంలో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా పనిచేసిన సూర్యదేవర హరికృష్ణ పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయడం వెనుక కూడా పలు ఆరోపణలు వచ్చాయి. తాను బాధ్యతలు స్వీకరించే నాటికి కేవలం రూ.9 కోట్లు మాత్రమే కార్పొరేషన్ ఖజానాలో నిధులు ఉన్నాయని ▶ 2లో

అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా రేపు నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు

వామపక్ష పార్టీల పిలుపు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి విష్ణు, సిపిఐ (ఎంఎల్) జిల్లా నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు రాందేవ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్‌ను అభిమానించే వారిని అమిత్‌షా ఎగతాళిచేస్తూ... అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, ఆ జపం ఏదో దేవుడిని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలపై దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా, కేంద్రం, బిజెపి వైఖరిలో మార్పు లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో అమిత్‌షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు.

రూ.294.20 కోట్లతో కృష్ణానదికి మరో రక్షణ గోడ

8 లో

తాడేపల్లి వద్ద వరద ముంపు నివారణకు చర్యలు - మంత్రివర్గ సమావేశంలో ఆమోదం - సుందరయ్య కాలనీ, మహానాడు కాలనీలకు మోక్షం

రాష్ట్రంలో పాగాకు మతోన్మాద శక్తుల యత్నం

అప్రమత్తంగా ఉండాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో పాగావేసేందుకు మతోన్మాద శక్తులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయని, వాటిపట్ల అప్రమత్తంగా వుండి ప్రతిఘటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామారావు అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశన్నంటుతున్నాయని, మరోవైపు సాధారణ ప్రజలకు ఉపాధి తగిన విధంగా లేదని, పేదలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాసే ▶ 2లో

పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించుకుందాం

ప్రజాశక్తి-గుంటూరు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహన్‌రావు, జె.వినయ్, ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతున్నానని, మండలిలోనూ, బయటా పోరాటం చేస్తున్నానని చెప్పారు. ఈ పోరాటాలను కొనసాగిస్తానన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వై.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పొగాకు మతోన్మాద శక్తుల యత్నం

(మొదటి పేజీ తరువాయి)

యత్నాలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పేదలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని వాగ్దానం చేసి ఇప్పుడు సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.16 వేలకోట్లు భారం మోపిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని, ఉచిత ఇసుక విధానాన్ని అమలు పరచాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్ల నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతులు అనేక వ్యయ ప్రయాసలకోర్చి పంటలు పండిస్తే మద్దతు ధర రావట్లేదని, మిర్చికి మద్దతు ధర కల్పించాలని కోరారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీచేసి అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. స్కీమ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికలకు ముందు స్కీమ్ వర్కర్స్‌కు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎం.రవి, బి.వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్.అరుణ, ఎస్ఎస్.చెంగయ్య, జవహర్‌లాల్, పి.కృష్ణ, ఎమ్.ఎ.ఛిష్టీ పాల్గొన్నారు.



తక్కువ పెట్టుబడి.. దీర్ఘకాల దిగుబడి..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల దీర్ఘకాలిక దిగుబడులు లభించే డ్రాగన్ ఫ్రూట్స్ సాగు వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో పాటు ఒకసారి మొక్క నాటితే 20 నుంచి 25 ఏళ్ల పాటు దిగుబడి నిచ్చే డ్రాగన్ పండ్ల తోటలను జిల్లాలో 37.40 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. నరసరావుపేట, గురజాల, వినుకొండ, మాచవరం, నాదెండ్ల, రెంటచింతల, క్రోసూరు, యడ్లపాడు, దాచేపల్లి, నకరికల్లు తదితర మండలాల్లో ఈ సాగు ఎక్కువగా ఉంది. నరసరావుపేట మండలం అర్వపల్లిలో రైతు షేక్ సాంబశివరావు మొదట రెండెకరాల్లో సాగు చేపట్టి గతేడాది మరో రెండెకరాలను కలిపి 4 ఎకరాలు సాగు చేస్తున్నారు.

గతంలో కర్ణాటక రాష్ట్రంలో వాణిజ్య పంటలు సాగు చేపట్టి ఒక ఏడాది మరో ఏడాది నష్టాలు చవి చూసిన నరసరావుపేట మండలం అర్వపల్లి గ్రామానికి చెందిన సాంబశివరావు 3 ఏళ్ల క్రితం డ్రాగన్ పంట సాగు చేసి 2 ఎకరాలలో 2 వేల మొక్కలు నాటారు. ఎకరాకు 500 స్తంభాలు చొప్పున 2 ఎకరాలలో వెయ్యి సిమెంట్ స్తంభాలపై రింగ్ సిస్టమ్ ద్వారా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నాడు. మొక్కలను వియత్నం, తైవాన్ నుంచి తెప్పించుకొని నాటారు. ఎకరాకు రూ 5 లక్షల ప్రకారం రూ 10 లక్షల దాకా ఖర్చు చేశారు. 25 ఏళ్ల పాటు డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి ఎకరాకు 5 నుండి పది టన్నుల దిగుబడి ఉంటుందని టన్ను రూ.80 వేల నుంచి రూ.లక్ష పలుకుతుందన్నారు. గత ఏడాది టన్ను రూ.1.30 లక్షల వరకు కూడా ధర పలికడంతో పెట్టిన పెట్టుబడి ఏడాది లోనే వచ్చిందన్నారు. మొక్కల వయస్సు పెరిగే కొద్ది కొమ్మలు కూడా విస్తరిస్తాయని ఫలితంగా పూత పెరిగి పండ్ల దిగుబడి బాగుంటుందన్నారు.సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మొదటి ఏడాదే పెట్టిన పెట్టుబడి వస్తుంది.ఏడాదిలో 4 నుండి 6 నెలల పాటు 15 రోజులకు ఒకసారి పండ్లు కోతకు వస్తాయన్నారు. ఒక్కసారి రూ 6 లక్షల పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలం దిగు బడి వస్తుందని ఆశించి డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నానని సాంబశివరావు పేర్కొన్నారు.

తిరుగు ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి సొంతూళ్లకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈ క్రమంలో గురు, శుక్రవారం నుండి వారివారి ఉద్యోగ, నివాస ప్రాంతాలకు తిరిగి వెళ్లేందుకు నరసరావుపేటలోని ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. దీంతో ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు బస్టాండ్ కిటకిటలాడుతూ కనిపించింది. పలువురు ముందుగా రిజర్వేషన్లు చేయించుకోగా, రిజర్వేషన్లు లేని వారు అతి కష్టంపై ప్రయాణాలు సాగించారు. నరసరావుపేట నుండి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు తరలివెళుతున్నారు. ఆర్టీసీ అధికారులు కూడా రద్దీ దష్ట్యా 200లకు పైగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. రద్దీ నేపథ్యంలో చోరీలకు అవకాశం ఉందని, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ సిబ్బందితోపాటు ప్రయాణికులకు డిపో మేనేజర్ సూచించారు.





నరసరావుపేట బస్టాండులో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు... బస్సును ఎక్కే ప్రయత్నంలో ప్రయాణికులు

నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవనాలు పూర్తి

పోస్టుల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్ : ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

నిర్మాణం మధ్యలో నిలిచిన అంగన్వాడీ కేంద్రాలను త్వరలో పూర్తి చేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖపై స్థానిక తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్షించారు. పేదలందరికీ పథకాలు సక్రమంగా అందకుంటే సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్వాడీలకు అండగా ఉంటున్నామని, పోస్టులను భర్తీకి త్వరలో ప్రకటన జారీ చేస్తామని చెప్పారు. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో 366 అంగన్వాడీ కేంద్రాలుండగా వీటిల్లో 84 స్వంత భవనాల్లో, 92 పాఠశాలలు, పంచాయతీ భవనాల్లో నడుస్తున్నాయని, 140 వరకు అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా 29 భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉందన్నారు. గర్భిణులు 1949 మంది, బాలింతలు 2006 మంది, ఆరేళ్లలోపు చిన్నారులు 17581 మంది ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సకాలంలో అందించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల కొరత లేకుండా చూడాలని, అన్ని కేంద్రాల్లోనూ విద్యుత్ సదుపాయం తప్పనిసరిగా కల్పించాలని చెప్పారు.

నేడు లెజెండరీ రక్తదాన శిబిరం

అపోహలు వీడి రక్తదానం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని, రక్తదానం ప్రాణదానం అంటే ఒకరి ప్రాణాలు నిలబెట్టడమేనని జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా వినుకొండలోని గంగినేని ఫంక్షన్‌హాలులో శనివారం లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

కార్పొరేషన్.. కరెప్షన్..!

(మొదటి పేజీ తరువాయి)

ఐదు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన పులి శ్రీనివాసులు తెలిపారు. సి.బిల్స్ రూపంలో దాదాపు రూ.10 కోట్ల వరకు గతంలో పనిచేసిన కమిషనర్లు పెండింగ్‌లో ఉంచగా ఇప్పటికిప్పుడు మంజూరు చేయాలని ప్రజా ప్రతినిధులు, కొంతమంది అధికారులు కమిషనర్‌కు బిల్లులు దాఖలు చేయగా ఆయన తిరస్కరించారు. దీంతో వివాదం మొదలైందని అధికార వర్గాలు తెలిపాయి.

గాంధీ పార్కులో అభివృద్ధి పనులు, నగరంలో వివిధ అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలతో పాటు కార్యాలయంలో చిన్న చిన్న అవసరాల కోసం కూడా కోట్ల రూపాయల బిల్లులను మేయర్, ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులకు సమర్పించగా గత కమిషనర్ చేకూరి కీర్తి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంచారు. వీటిల్లో కొన్నింటిని ఇన్‌ఛార్జి కమిషనర్ హయాంలో పెండింగ్‌లో ఉంచగా ఇంకా 270 బిల్లులు ఇప్పటికీ క్లియర్ కాలేదని తెలిసింది. వీటిపై ప్రస్తుత కమిషనర్ పులి శ్రీనివాసులు వివరణ కోరడంతోనే వివాదం మొదలైందని అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో గత సెప్టెంబరు మొదటి వారంలో బుడమేరు సమర్పించిన వరదల వల్ల విజయవాడలో వరద బాధితులకు ఆహార పానీయాలు అందించే విషయంలో గుంటూరు కార్పొరేషన్ రూ.9.24 కోట్ల ఖర్చు చేసింది. ఈ నిధులను కౌన్సిల్ ఆమోదం లేకుండానే కమిషనర్ వినియోగించారని, తమకు గానీ, టిడిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమాచారం ఇవ్వలేదని మేయర్ కావటి మనోహర్ నాయుడు ఆరోపించారు.

ప్రధానంగా విజయవాడ వాసులకు భోజనం కోసం 17 లక్షల ప్యాకెట్లు కు రూ.5.37 కోట్లు, తాగునీటి కోసం 3,31,800 వాటర్ బాటిల్స్ సరఫరా చేసినందుకు రూ.24.64 లక్షలు, బిస్కట్లు 2.10 లక్షల ప్యాకెట్లుకు రూ.19.80 లక్షలు, రొట్టెలు 3,180 కొనుగోలుకు రూ.52,840 ఖర్చు చేశారు. 13,58,992 పాల ప్యాకెట్ల కోసం రూ.3,07,21,016, ప్యాకింగ్ బ్యాగ్స్ 8 వేలు కొన్నందుకు రూ.52 వేలు, క్యారీ బ్యాగ్స్ కోసం రూ.1,53,900, రవాణా ఛార్జీలకు ప్రైవేటు వాహనాలకు రూ.1.22 లక్షలు, ఆర్‌టిసికి రూ.29.90 లక్షలు ఖర్చు చేశారని మొత్తం రూ.9.22 కోట్లు వెచ్చించినట్టు మేయర్ కావటి మనోహర్ నాయుడు ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులకు రాసిన లేఖల్లో పేర్కొన్నారు. ఇవన్నీ తప్పుడు లెక్కలని ఆయన తెలిపారు. 17 లక్షల ఆహార పొట్లాలు తయారు చేస్తే గుంటూరు ఘుమ ఘుమలాడాలన్నారు. ఇలా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. దీంతో ఇప్పట్లో కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం కన్పించడం లేదు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ వల్ల 3వ తేదీ వరకు సమావేశం జరిపే అవకాశం లేదని అధికారులు తెలిపారు. 3వ తేదీలోగా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మార్చి నెలాఖరు వరకు కౌన్సిల్ సమావేశం జరిపే అవకాశం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రమాదాల నివారణ, నిబంధనలపై చైతన్యం కోసం మాసోత్సవాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రమాదాల నివారణపై అవగాహన, నిబంధనలు పాటించేలా వాహనదారుల్లో చైతన్యం పెంచడానికి రహదారి భద్రత మాసోత్సవాలు దోహదం చేస్తాయని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులో గల స్వయం కృషి లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో హెవీవెహికల్ డ్రైవర్లకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన బ్రోచర్లను అధికారులు, డ్రైవర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే నెల 15వ తేదీ వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడపే వారిని గుర్తించడం, అధిక వేగంతో నడిపే వాహనాలను గుర్తించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులలో గుర్తించిన బ్లాక్ స్పాట్లను పరిశీలన చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సహాయ మోటారు తనిఖీ అధికారులు ఎం.మనీషా, వంశీకృష్ణ పాల్గొన్నారు.



మహిళా న్యాయవాది హత్యకేసులో ముగ్గురికి జీవితఖైదు

ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

గుంటూరు బార్ అసోసియేషన్ మహిళా న్యాయవాది రాచాబత్తుని సీతామహాలక్ష్మి హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ గుంటూరు 5వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.నీలిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ఇందులో బాధితురాలి కుటుంబానికి రూ.లక్షన్నర నష్టపరిహారంగా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గుంటూరులోని బ్రాడీపేట రెండో లైనుకు చెందిన గండికోట సుబ్బారావు ఇంజినీర్ ఉద్యోగం చేస్తూ రిటైర్ అయిన అనంతరం 2012లో బ్రాడీపేట 3వ లైనులో ఐదంస్తుల అపార్టుమెంటును (గండికోట అపార్టుమెంట్) నిర్మించాడు. గుంటూరు కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న సీతామహాలక్ష్మి ఈ అపార్టుమెంటులోని 3వ ఫ్లోర్‌లోని ఒక ఫ్లాటును రూ.20 లక్షలకు కొన్నారు. ముందుగా రూ.10 లక్షలు చెల్లించి అనంతరం విడతల వారీగా మిగతా మొత్తాన్నీ చెల్లించి అందులోనే నివాసం ఉంటున్నారు. డబ్బు మొత్తం చెల్లించినందుకు ప్లాటును తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలని సుబ్బారావును సీతామహాలక్ష్మి అడుగగా ఆయన కాలయాపన చేయడమే కాకుండా ఆమెను బెదిరిస్తూ వచ్చాడు. ఈ విషయమై సీతామహాలక్ష్మి అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో 2013లో ఫిర్యాదు చేశారు. ప్లాటను రిజిస్ట్రేషన్ చేయాలని గుంటూరు 4వ అదనపు జిల్లా కోర్టులో 2014లో సీతామహాలక్ష్మి సివిల్ సూట్‌ను సుబ్బారావుపై దాఖలు చేశారు. దీంతో సుబ్బారావు సివిల్, క్రిమినల్ కేసులు వెనక్కు తీసుకోవడంతోపాటు ప్లాటును ఖాళీ చేయాలని సీతామహాలక్ష్మిని ఒత్తిడి చేయడం మొదలుపెట్టాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో కక్ష పెంచుకున్న సుబ్బారావు ఆమెను అంతం చేయాలని నిర్ణయించుకున్నారు. 2014 జులై 17న సీతామహాలక్ష్మి కుమారుడు పవన్‌కార్తిక్ బాపట్లలో కాలేజీలో లెక్చరర్ విధులకు వెళ్లాడు. భర్త గోవిందరావు వ్యాపార పని మీద తెనాలికి వెళ్లాడు. అదే రోజు రాత్రి 8 గంటలకు సీతామహాలక్ష్మితో మాట్లాడాలని ఆమెను సుబ్బారావు బయటకు పిలిచాడు. ఆమె బయట మెట్ల వద్దకు రాగానే సుబ్బారావు భార్య శ్రీవాణి, పని మనిషిగా పని చేసే గుంటూరు నెహ్రూ నగర్‌కు చెందిన కట్టా మేరీజ్యోతి కలిసి సీతామహాలక్ష్మిని గట్టిగా పట్టుకోగా సుబ్బారావు కత్తితో సీతామహాలక్ష్మిని విచక్షణా రహితంగా పొడిచాడు. రక్తపు మడుగులో కూలిపోయిన సీతామహాలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. ఇది గమనించిన ఇతర ప్లాట్లలోని వారు బయటకు వచ్చి చూడగానే సుబ్బారావు, మిగతా ఇద్దరూ పరారయ్యారు. దీనిపై మృతురాలి కుమారుని ఫిర్యాదుతో అప్పటి అరండల్‌పేట సిఐ షేక్ బిలాలుద్దీన్ కేసు దర్యాప్తు చేశారు. అనంతరం వచ్చిన సిఐ వై.శ్రీనివాసరావు కోర్టులో ఛార్జీషీటు దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ తరుపున పల్లపు కృష్ణ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై మేరకు తీర్పును వెలువరించారు.



మొక్క జొన్న ప్రకృతి సాగు పరిశీలన

ప్రజాశక్తి - తెనాలి

గుంటూరు ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు, జిల్లా వనరుల కేంద్ర బృందం ఎరుకులపూడిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను శుక్రవారం సందర్శించారు. కత్తెర పురుగు నివారణకు రైతు విజయ లక్ష్మి అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. అలాగే రసాయనిక పద్ధతులలో సాగు చేస్తున్న మొక్కజొన్న పొలాలను కూడా సందర్శించి మొక్కల ఎదుగుదల, వేరు వ్యవస్థ, కత్తెర పురుగు ఆశించిన మొక్కలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులకు ఎలా ఉపయోగ పడు తున్నాయన్న అంశాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్సీ అధికారులు సునీత, శివ కుమారి, రాజ వంశీ, జిల్లా అధికారి రాజ కుమారి, తెనాలి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛ దివస్ ర్యాలీ

ప్రజాశక్తి -గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల 3వ శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌లో సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి హిందూ కాలేజ్ జంక్షన్ వరకు మెగా ర్యాలీ, మానవహారం మరియు స్వచ్ఛత ప్రతిజ్ఞ జరుగుతుందని, ర్యాలీలో జిల్లా కలెక్టర్, నగర కమిషనర్, ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొంటారని నగర ప్రజలు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



విజయం సాధించిన క్రికెట్ జట్టు

ఉత్సాహంగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు ఆరవ రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగాయి. నెల్లూరు వర్సెస్ ప్రకాశం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. ప్రకాశం జట్టు టాస్ గెలిచి నెల్లూరు జట్టును బ్యాటింగ్ కు ఆహ్వానించగా నెల్లూరు జట్టు నిర్ణిత 20 ఓవర్లలో 155 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ కు దిగిన ప్రకాశం జట్టు 14.1 ఓవర్లలో 90 పరుగులు చేసి ఆల్ అవుట్ అవడంతో నెల్లూరు జట్టు 65 పరుగుల తేడాతో విజయం సాధించింది. 4 ఓవర్లలో 12 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసిన సాలుంకి అఖిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను కైవసం చేసుకున్నారు. చిత్తూరు వర్సెస్ తూర్పుగోదావరి మధ్య జరిగిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 9 వికెట్ల నష్టానికి గాను 138 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 19.5 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆల్ అవుట్ అవ్వడంతో పరాజయం పాలైంది. టివి సాయి శ్రావణ్ 46 బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను గెలుచుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఇద్దరికీ పట్టణ తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ళ చిరంజీవి సహకారంతో ఒక్కొక్కరికీ రూ. 10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు.



పదో వార్డులో ఫ్రైడే డ్రైడే నిర్వహణ

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక 10 వార్డు లోని జంధ్యాల వారి వీధిలో శుక్ర వారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ వల్లూరి లక్ష్మీపతి రావు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ కారుమూరు హెలెన్ నిర్మల, టిపిఒ ఎం .సాంబశివరావు, శానిటేషన్, సచివాలయం సిబ్బంది పాల్గొని ఫ్రైడే డ్రై డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు పెరగకుండా రీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి అందె బాల చంద్రమౌళి, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎఎన్ఎం అక్కమ్మ, వాత్సల్య, శంషాద్ బేగం, ఆశా కార్యకర్తలు, నగరదీపికలు దుర్గ, శానిటరీ సెక్రటరి లక్ష్మీ, రిసోర్స్ పర్సన్ గొల్లపూడి శివజ్యోతి ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి


ప్రజాశక్తి - తెనాలి

రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ తెనాలి రైల్వేస్టేషనులోకి వస్తుండగా అందులో నుండి సుమారు 25 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - తెనాలి

మహిళ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలెం నుండి ఇస్లాంపేట వైపు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన సుమారు 50 ఏళ్ల మహిళ గురువారం ఉదయం మృతి చెంది పడి ఉన్న సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని తమిళనాడుకు చెందిన మణిగా గుర్తించారు. తెనాలిలో కొంతకాలంగా ఉంటూ రోజువారీ పనులకు వెళుతుండే మణికి ఇటీవల ఈ మహిళ పరిచయమైంది. ఈ నెల15వ తేదీ రాత్రి పొద్దుపోయాక మృతురాలు, మణి మద్యం తాగేందుకు తూర్పు కాల్వకట్ట రోడ్డులోని ఓ మెకానిక్ షాపు వద్దకు వెళ్లారు. అక్కడ మాటా మాటా పెరగడంతో మణి మహిళపై దాడి చేయగా ఆమె మృతి చెందినట్టు పోలీసుల విచారణలో తెలిసింది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు.



విజ్ఞాన కేంద్రం కమిటీకి విరాళం అందిస్తున్న సురేష్ తదితరులు

పల్నాడు విజ్ఞాన కేంద్రానికి ముత్తవరపు సురేష్ రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - యద్దలపాడు

మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన వామపక్ష అభిమాని, ప్రజా కళాకారుడు ముత్తవరపు సురేష్ తన మనుమరాలు ద్వారా రూ.5 లక్షలను పల్నాడు విజ్ఞాన కేంద్రానికి విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని పల్నాడు విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ గద్దె చలమయ్య, ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు వై.రాధాకృష్ణ, ప్రజానాట్యమండలి, ప్రజాకళల ఆర్గనైజర్ ఎన్.కాళిదాసు సమక్షంలో అందించారు.

పన్ను వసూళ్లు నూరుశాతం పూర్తవ్వాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆస్తి, ఖాళీస్థలం, నీటి పన్నులను మార్చి 31 కల్లా నూరుశాతం వసూళ్లే లక్ష్యంగా పని చేయాలని సిబ్బంది, అధికారులను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆదేశించారు. దీనిపై వార్డు సచివాలయ పరిపాలనా కార్యదర్శులతో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ శుక్రవారం సమీక్షించారు. పురపాలక సంఘ పరిధిలో బకాయిలున్న ప్రతి అసెస్మెంట్ యజమాని పన్ను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్తగా నిర్మించిన, పాత భవనాలపై అదనంగా నిర్మించిన భవనాలను గుర్తించి పన్ను విధించాలని చెప్పారు. పట్టణ ప్రజలు అందరూ పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశంలో పురపాలక సంఘ రెవెన్యూ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎస్.బెయిలీ బాబు, సయ్యద్ జహంగీర్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు సరుకులు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని 26వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు శుక్రవారం సరుకుల పంపిణీ చేశారు. వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ జానీబాష పాల్గొని గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు గుడ్లు, పాలు, చిక్కి, బియ్యం, కందిపప్పు తదిరాలను అందించారు. కార్యక్రమంలో షేక్ రసూల్, అంగన్వాడీ టీచర్ సీత పాల్గొన్నారు.



నీటితో నిండుగా ఉన్న చెరువు



చందవరానికి నీటి శాపం

చెరువు నిండుగా ఉన్నా 20 రోజులుగా నిలిచిన సరఫరా

ప్రజాశక్తి - నాదెండ్ల

నిండు కుండలా చెరువు... దానిపక్కనే నిలువెత్తు నీళ్ల ట్యాంకు... అయినా పైపులైన్ల ద్వారా నీరు సరఫరా కావడం లేదు.. నీటి పన్ను కడుతున్నా డబ్బా నీళ్లు కొనుక్కోవాల్సిన దుస్థితి.. తాగడానికే కాదు.. వాడుకోవడానికి, పశువుల అవసరాలు తీర్చడానికి సైతం డబ్బులను నీళ్లలా ఖర్చు చేయకుంటే అవసరం గడవని శాపానికి చందవరం గ్రామస్తులు గురయ్యారు.

నాదెండ్ల మండలంలోని చందవరం గ్రామంలో 20 రోజుల నుండి పంచాయతీ వారు నీరు సరఫరా చేయడం లేదు. ఎందుకని ఇన్‌ఛార్జి కార్యదర్శిని అడిగితే... నీటిని విడుదల చేయాల్సిన వర్కర్‌కు రెండు నెలలుగా జీతం ఇవ్వకపోవడ వల్ల అతను పని చేయడం లేదని, దీనిపై సర్పంచ్‌ను తాను సంప్రదించగా తెలీదంటున్నారని చెబుతున్నారు. ఏతావాతా నీటి సరఫరా నిలిచి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామంలో సుమారు 2200 కుటుంబాల వరకు ఉండగా జనాభా 3800-4 వేల మధ్య ఉంటుంది. గ్రామ నీటి అవసరాలు తీర్చడానికి సుమారు పదెకరాల్లో చెరువు, దాని పక్కనే 10 వేల లీటర్ల వరకు సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్‌ట్యాంకు ఉంది. గతంలో ప్రతిరోజూ ఉదయం పూట పైపులైన్ల ద్వారా నీరు సరఫరా చేసేవారు. అయితే 20 రోజుల నుండి పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు బోరు నీరు ఆధారంగా రోజులు గడపాల్సి వచ్చింది. గ్రామంలో వీధి బోర్లు 15 వరకు ఉండగా సగం కుటుంబాలకు సొంతంగా బోర్లున్నాయి. అయితే అన్నింటి నుండి వచ్చేది ఉప్పునీరే కావడంతో వీటిపి పరిమిత అవసరాలకే స్థానికులు ఉపయోగించుకోగలుగుతున్నారు.

తాగునీటి కోసం, వంట చేసుకోవడానికి అవసరమైన నీటి కోసం స్థానికులు ప్రైవేటు వాటర్ ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. స్నానం, బట్టలు ఉతకడం తదితర ఇతర అవసరాలకు బోరునీరే ఆధారమైంది. పశువులకు సైతం వాటర్ ప్లాంట్ల నీరు తెచ్చుకోక తప్పడం లేదు. దీంతో ఒక్కో క్యానును రూ.6 వరకు వెచ్చించి కొనాల్సి వస్తోంది. 2020లో వైసిపి హయాంలో గ్రామంలో రూ.90 లక్షలతో వాటర్ ప్లాంట్‌ను నిర్మించినా రెండు మూడు నెలలకే మరమ్మతులకు గురై మూలన పడింది. దీంతో గ్రామంలోని రెండు ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లు, సమీప గ్రామమైన సాతులూరులోని వాటర్‌ప్లాంట్లకు చందవరం గ్రామస్తులు నీరు కోసం బారులు తీస్తున్నారు.

సొంత బోర్లు లేనివారు ఇంటి, వంటి అవసరాల కోసం వాడుకోవడానికి నీటి కోసం కటకటలాడుతున్నారు. మొత్తంగా గ్రామమంతా నీటి ఇక్కట్లతో సతమతమవుతోంది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుల్ బిల్లుల భారంతో కుటుంబాలు గడవడమే కష్టంగా ఉంటే రోజు ఐదారు నీళ్ల క్యాన్లను కొనాల్సి రావడంపై ఆగ్రహానికి గురవుతున్నారు. పశువులకు నీరు పెట్టడానికి ఎంత నీరు కొనాలని ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో వైసికికి చెందిన వారు సర్పంచ్ కావడం, గత ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడంతో రాజకీయ విభేదాల కారణంగా ఈ పరిస్థితి తలెత్తినట్లు స్థానికులు భావిస్తున్నారు. రాజకీయ వివాదాలు ప్రజలకు శాపం కాకుండా చూడాలని, నీటి సరఫరాకు సత్వరం చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నెల కాక ముందే మరో వ్యాపారి అప్పులు చేసి పరారీ?

త్వరలో మరి కొందరు ఐపి పెట్టడం ఖాయమంటూ గుసగుసలు

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలో ఎరువుల వ్యాపారం చేసే మరో వ్యక్తి అప్పులు చేసి పరారైనట్లు పుకార్లు వినవస్తున్నాయి. గత నెలలో ఎరువుల వ్యాపారం చేసే వ్యక్తి రూ.కోటిన్నర అప్పులు చేసి పట్టణం వదలి వెళ్లిన ఘటన మరవక ముందే ఇప్పుడు మరో పురుగు మందుల వ్యాపారి ఉదంతం వెలుగులోకి రావటంపై వ్యాపారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందిన సదరు వ్యక్తి గతంలో దెబ్బతిన్నప్పుడు ఆస్తులు సర్దుబాటు చేసి మార్కెట్‌లో వ్యాపారం కొనసాగిస్తున్నాడు. సుదీర్ఘ కాలంగా పట్టణంలో నివాసముంటున్న నేపథ్యంలో సదరు ఎరువుల వ్యాపారం చేస్తున్న వ్యక్తి తన సమీప కుటుంబ సభ్యులు, మిత్రుల నుండి పెద్దఎత్తున అప్పులు చేసి, చిట్టీలు పాడుకొని గత వారం రోజులుగా కనిపించకపోవటంతో అప్పులిచ్చిన వారు ఆరా తీస్తున్నారు. సుమారుగా రూ.కోటి నుండి రూ.కోటిన్నర వరకు అప్పులు చేసి పరారైనట్లు వినికిడి. పొట్టి శ్రీరాములు విగ్రహానికి సమీపంలో వ్యాపారం చేసే ఇతను వారం రోజులుగా కనిపించకపోవటంతో కొందరు పెద్ద మనుషులు అప్పులిచ్చిన వారి జాబితాను శుక్రవారం రాయటం ప్రారంభించారు. గడిచిన ఏడాదిగా వ్యాపార రంగం మందగించటంతో ఇటువంటి సంఘటనలు జరుగుతున్నట్లు పలువురు వాపోతున్నారు. రోటేషన్ లేకపోవటం, రావాల్సిన పద్దులు రాకపోవటం, అప్పుల వారి వత్తిళ్లతో చెల్లింపుల సమస్యను అధిగమించలేక పరారవుతున్నట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో మరికొందరు ఇదే బాట పట్టనున్నట్లు గుసగుసలు వినవస్తున్నాయి. ఇటీవల పట్టణంలో ప్రవేట్ చీట్ వ్యాపారం చేసే వ్యక్తి కూడ సుమారు రూ.11 కోట్ల అప్పులు చేసి పరారైనట్లు సమాచారం. ఇద్దరు మహిళలు కూడ తమకున్న అప్పుల నేపథ్యంలో పలువురికి నోటీసులు జారి చేశారు. ఇలా వరసగా దివాలా తీస్తుండంటంతో అప్పులిచ్చిన వారు, చిట్టీలు వ్యాపారాలు చేసేవారు బెంబేలెత్తుతున్నారు. ఇంకెవరు ఐపీలు పెడతారోనని ఆందోళన చెందుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై నేడు అవగాహన సమావేశం

హాజరుకానున్న కె.ఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజవకర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చిలో జరగనున్న నేపథ్యంలో నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో అవగాహన సమావేశం శనివారం నిర్వహిస్తామని యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు హాజరై అనేక అంశాలపై వివరిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక రైతు, మహిళా, విద్యార్థి, యువజన, మిగతా అన్ని ప్రజా సంఘాలు హాజరవ్వాలని కోరారు.

జాతీయస్థాయి కబడ్డీ విజేత ఇండియన్ నేవీ

రన్నరప్‌గా తమిళనాడు, 3, 4 స్థానాల్లో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్, కర్నాటక జట్లు

ప్రజాశక్తి-ఈపూరు

క్రీడలను ప్రోత్సహించడంతోపాటు క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లలో ఆరు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ క్రీడాకారుల కోసం నియోజకవర్గ కేంద్రంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియం, మండల కేంద్రమైన ఈపూరుకు ముప్పాళ్ల నుండి వెళ్లే రోడ్డును రెండు వరుసల రహదారి చేస్తామని చెప్పారు. తొలుత ఇండియన్ నేవీ - తమిళనాడు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌ను జీవి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చూశారు. ఇరు జట్లు హోరాహోరీగా తలపడగా ఇండియన్ నేవీ జట్టు విజేతగా నిలిచింఇ. ఈ జట్టుకు మొదటి బహుమతిగా రూ.మూడు లక్షల బహుమతి, రన్నరప్‌గా నిలిచిన తమిళనాడు జట్టుకు రూ.రెండు లక్షలు నగదు బహుమతిని ఎమ్మెల్యే ప్రదానం చేశారు. మూడో స్థానంలో నిలిచిన ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ (టాస్) జట్టుకు రూ.లక్ష నగదు బహుమతి, నాలుగో స్థానాన్ని దక్కించుకున్న కర్ణాటక బిఎంటిసి జట్టుకు రూ.75 వేలు, ఐదో స్థానం సాధించిన ఏపీ స్కై జట్టు రూ.50 వేలు, ఆరో స్థానం సాధించిన పంజాబ్ జట్టుకు రూ.40 వేలు, ఏడో స్థానం పొందిన జార్ఖండ్ జట్టుకు రూ.30 వేలు, 8వ స్థానం సాధించిన హర్యానా జట్టుకు రూ.20 వేలు, 9వ స్థానం పొందిన ఎస్వీఎస్ ముప్పాళ్ల జట్టుకు రూ.15 వేలు, 10 స్థానం పొందిన జీవి యువసేన జట్టుకు రూ.15 వేలు, 11వ స్థానాన్ని దక్కించుకున్న సత్తెనపల్లి జట్టుకు రూ.15 వేలు, 12వ స్థానం పొందిన రావిపాడు జట్టుకు రూ.15 వేలు చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేశారు. భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా డీఎస్పీ కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో వినుకొండ రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు. టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, రైతుమిత్ర కమిటీ నిర్వాహకులు తల్లపనేని రామారావు, తల్లపనేని కోటేశ్వరరావు, సూరే కోటేశ్వరరావు, సూరే బ్రహ్మయ్య, పులి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ జి.శ్రీనివాసరావు, వి.హనుమయ్య పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు

ప్రణాళికాబద్ధంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహణ : కలెక్టర్



టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



స్వచ్ఛాంధ్రపై మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రవేటు సంస్థలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయితీ సెక్రటరీలతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రతి నెల మూడో శనివారం ఈ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుం దన్నారు. ప్రతి నెల ఒక థీమ్‌తో 12 నెలలు స్వచ్ఛత కార్యక్రమాలను కాంపెయిన్ మోడ్‌లో నిర్వహించేలా మార్గదర్శకాలను జారీ చేశారన్నారు. మొదటినెల జనవరి 18 శనివారం న్యూ ఇయర్- క్లీన్ స్టార్‌దీమ్ తో స్వచ్ఛత కార్యక్రమాలు జిల్లాలోని ప్రతి మున్సిపాల్టీలో, గ్రామ స్థాయిలోను నిర్వహించాలన్నారు.

ప్రజలకు విస్తృత అవగాహన : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల 3వ శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే కార్యక్రమాల్లో నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాల నిర్వహణపై జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దడానికి 12 నెలలకు 12 థీమ్‌లతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అందులో భాగంగా ఈనెల 18న శనివారం న్యూఇయర్ - క్లీన్‌స్టార్ట్ థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. శనివారం కలెక్టరేట్ నుండి హిందూ కాలేజి జంక్షన్ వరకు 2 వేల మందితో స్వచ్ఛత ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేపడతామన్నారు.. అలాగే వార్డు సచివాలయాల వారీగా ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాస్ క్లీనింగ్, క్లీనింగ్, జిఎంసి స్థలాలు, డ్రైన్ల శుభ్రం, గార్బేజ్ తొలగింపు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాష, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

తెనాలి ఓరియంటల్ ఇన్సూరెన్స్ కార్యాలయం వద్ద

20న పరిహారం కోసం పసుపు రైతుల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి - తెనాలి

కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ 20వ తేదీన తెనాలి ఓరియంటల్ ఇన్సూరెన్స్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ రావు చెప్పారు. స్థానిక ఆర్టిసి బస్టాండ్ వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ములక శివ సాంబిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. నష్టపోయిన రైతుల తరపున శివశంకరరావు మాట్లాడుతూ దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ ప్రమాదం జరిగి ఏడాది దాటుతుందన్నారు. క్వింటాళ్ రూ 7వేలు చొప్పున పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిన వ్యవసాయ మంత్రి సైతం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రమాదంలో రూ. 80 కోట్ల విలువైన పసుపు దగ్ధమైనా ఇటు అధికారుల నుంచి గాని, ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి స్పందన లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నాయకులు వేముల వెంకట్రామయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వ హయాంలో అధికారుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేదని వాపోయారు. బాధిత రైతుల పక్షాన ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బి చిన్న రామిరెడ్డి, వై వెంకటేశ్వరరావు, పి కోటేశ్వరరావు, జెట్టి బాలరాజు, వై బ్రహ్మేశ్వర రావు పాల్గొన్నారు.

39 మంది రాజధాని రైతులకు 72 రిటర్నబుల్ ప్లాట్లు



రైతులకు పత్రాలను అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - తుళ్ళూరు

రాజధాని నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు అధికారులు ఈ - లాటరీ విధానంలో రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. శుక్రవారం విజయవాడలోని సిఆర్ డిఎ కార్యాలయంలో ప్లాట్ల కేటాయింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజధాని అమరావతి లోని 5 గ్రామాలకు చెందిన 39 మంది రైతులకు 72 రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస,వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. ఈ-లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జిఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించారు. అబ్బరాజు పాలెం, రాయపూడి 1,2, కొండమరాజుపాలెం, వెలగపూడి, మందడం 1,2 గ్రామాలకు సంబంధించి 39 మంది రైతులకు మొత్తంగా 72 ప్లాట్లు అందజేశారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సౌకర్యవంతంగా జరిగేందుకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని అధికారులు తెలిపారు. ఈ- లాటరీ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ భార్గవతేజ, సిఆర్‌డిఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె ఎస్ భాగ్యరేఖ, కె స్వర్ణమేరి, ప్లానింగ్ విభాగ డైరెక్టర్ బి సురేష్ కుమార్, తహశీల్దార్ అరుణాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుంటూరు లలిత హాస్పిటల్ ఆధ్వర్యంలో

లింగంగుంట్లలో రేపు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

లలితా హాస్పిటల్, గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 19న పెదకూరపాడు మండలం, లింగంగుంట్ల గ్రామంలో ఉచిత కంటి, బ్రెయిన్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రాఘవశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ క్యాంప్‌లో మెదడు, నరాల సమస్యలు, పక్షవాతం, తలనొప్పి, తూలుడు, ఫిట్స్, వృద్ధులు, చిన్న వయసులో వచ్చే నరాల సమస్యలు, స్పాండిలైటిస్, న్యూరోపతి, నడుంనొప్పి, వెన్నెముక సమస్యలు ఉన్న వారికి, కంటి శుక్లం ఉన్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అర్హులైన వారికి ఎన్‌టిఆర్ వైద్యసేవా పథకం ద్వారా లలితా ఆసుపత్రిలో ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు చేస్తామన్నారు.ఈ శిబిరంలో ఉచిత చెకప్, బ్లడ్ షుగర్, ఇసిజి, కంటి చెకప్, న్యూరాలజిస్ట్ కన్సల్టేషన్ చూడటం జరుగుతుందని, కావున ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కౌలు రైతులకు వడ్డీలేని రుణాలు

రూ.లక్ష దాటితే పావలా వడ్డీ వసూలు

లీడ్‌బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి

ప్రజాశక్తి - దుగ్గిరాల

గుర్తింపు కార్డు కలిగి ఉన్న కౌలు రైతులకు లక్ష రూపాయలు వడ్డీ లేని పంట రుణాలు అందజేస్తామని లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఈమని గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఈమని బ్రాంచ్ మరియు వ్యవసాయ శాఖ వారు శుక్రవారం సంయుక్తంగా నిర్వహించిన కౌలు రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మూడు లక్షల రూపాయల వరకు పావలా వడ్డీ రుణాలు అందిస్తామని, భూ యజమానులు లోను తీసుకోనటువంటి సర్వే నంబర్లు గుర్తించి కౌలురైతులకు రుణాలు ఇస్తామన్నారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఏసు బాబు మాట్లాడుతూ ఈమని గ్రామంలో 52 రైతు మిత్ర గ్రూపులు ఉన్నట్లు తెలిపారు. వన్ టైం సెటిల్మెంట్ క్రింద రూ. 10 నుండి రూ.15 వేలు కడితే క్లియర్ అవుతాయన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం నాగమల్లేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ నిబంధనలు లేకుండా ప్రతి కౌలు రైతుకు రుణాలు ఇవ్వాలని కోరారు. రుణాలు తిరిగి చెల్లించటం కౌలు రైతుల బాధ్యత అనే తెలిపారు. కార్యక్రమంలో ఏడిఏ ఉషారాణి ఏవో శిరీష జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, రైతు సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది రఫీ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్

21నుంచి వర్సిటీ పరిధిలో యూజీ డిగ్రీ వన్ టైం ఆపర్చునిటీ పరీక్షలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో యూజీ డిగ్రీ ఇయర్ ఎండ్ కోర్సులకు సంబంధించి వన్ టైం ఆపర్చునిటీ పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎ శివప్రసాదరావు తెలిపారు. బిఎ, బీకాం (జనరల్), బికాం (రీ స్ట్రక్చర్), బీకాం (ఒకేషనల్), బిబిఎం, బిసిఏ, బి ఎస్సి, బిఎఓఎల్ పరీక్షల షెడ్యూలు విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ పరీక్షలు ఈనెల 21వ నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులకు గుంటూరులోని ఏసీ కళాశాల, అలాగే ఉమ్మడి ప్రకాశం జిల్లా కళాశాలల విద్యార్థులు ఒంగోలులోని రాఘవ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ప్రాక్టికల్, ఇంటర్నల్స్, వైవా, ప్రాజెక్ట్ వంటి పరీక్షలు ఫిబ్రవరి 17 నుంచి 22వ తేదీ వరకు గుంటూరులోని ఏసీ కళాశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేపు గుంటూరులో సచివాలయ ఉద్యోగుల సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆదివారం గుంటూరులో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె.అనురాధ, డాక్టర్ ఎం.గురుస్వామి తెలిపారు. గుంటూరులో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం కేటగిరీలుగా విభజించి హేతుబద్ధీకరణ చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. హేతుబద్ధీకరణ ప్రకటన సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళనకు గురి చేస్తుందని చెప్పారు. మొదట గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దష్టి పెట్టాలని, గత ప్రభుత్వంలో క్రమబద్ధీకరణ పేరుతో తొమ్మిది నెలలు ఆల స్యంగా పేస్కేల్ ప్రకటించి నందున ఉద్యోగులు చాలా నష్ట పోయారని, అందుకు రావాల్సిన బకాయిలను ఇవ్వాలని, నష్టపోయిన రెండు నోషన్ ఇంక్రిమెంట్లను ఇవ్వాలని, ఇతర అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని ఉద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. మరోవైపు రోజుకో సర్వేల పేరుతో ఇబ్బంది లకు గురి చేస్తున్నారన్నారు. గుంటూరులో జరిగే రాష్ట్ర సమా వేశంలో చర్చించి, తగు నిర్ణయాలు చేస్తామన్నారు. కావున గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ అధికారులు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి మండలంలో శుక్రవారం విద్యుత్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 37 బృందాలుగా ఏర్పడి, గృహ, వాణిజ్య, పరిశ్రమల విద్యుత్ సర్వీసులను అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో అనధికారకంగా విద్యుత్ వినియోగిస్తున్న రెండు సర్వీసులకు రూ.33 వేలు, అధిక లోడ్ వినియోగించే 177 మంది విద్యుత్ వినియోగదారులకు 8 లక్షల పదకొండు వేల అపరాధ రుసుముగా ఈ సందర్భంగా సిఆర్‌డిఎ సర్కిల్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అన్నివేళలా అందుబాటులో ఉంటూ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. అదేవిధంగా విద్యుత్ బకాయిలు సకాలంలో వసూలు చేయాలని, విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ చోర్యం పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఈ ఈ వెంకటేశ్వర్లు, ఆపరేషన్ ఈ ఈ సంజీవ రావు, మంగళగిరి డీఈ ఈ సురేష్ బాబు, కృష్ణానగర్ ఏఈఈ షణ్ముఖరావు, డివిజన్ ఏఈలు విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి మండల పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గుంటూరు రోడ్డు తూర్పు వైపు నులకపేట 33/11 కె.వి విద్యుత్ కేంద్రం నుండి శర్మ డాబా వరకు, ప్రకాష్ నగర్ అంబేద్కర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని, విద్యుత్ శాఖ మంగళగిరి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సురేష్ బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్

- సంయుక్త కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించుకునే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ను ఈ నెల 18న జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే జిల్లా ఆదేశించారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ-దివస్ కార్యక్రమంపై సంబంధిత అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఆన్‌లైన్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పరిశుభ్రమైన రోడ్లు, చెత్త రహిత పరిసరాలే లక్ష్యంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 'నూతన సంవత్సరం-పరిశుభ్ర ప్రారంభం' నినాదంతో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు.

ప్రతి మండలంలోనూ ఒక గ్రామంలో రీసర్వే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రీ సర్వేలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని.. రీ సర్వే ప్రాధాన్యం ప్రతి ఒక్కరికీ తెలిసేలా గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జేసీ ఆధ్వర్యంలో రీ సర్వేకు సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో ప్రతి మండలంలోనూ ఒక గ్రామాన్ని పైలెట్‌గా తీసుకుని రీసర్వే నిర్వహించాలన్నారు. గ్రామ సరిహద్దును ఎలాంటి పొరపాట్లూ లేకుండా నిర్ధారించాలన్నారు. గ్రామాన్ని ఖండాలుగా విభజించి (సుమారు 200 ఎకరాల నుంచి 250 వరకు), అందులో ప్రభుత్వ భూములను గుర్తించి వాటి హద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. అనంతరం రైతులకు సంబంధించి పట్టా భూములను సర్వే చేయాలన్నారు. ఆ గ్రామంలో గ్రామసభ, ర్యాలీ నిర్వహించి వారికి రీసర్వే ప్రాధాన్యతను వివరించాలని చెప్పారు. సర్వే చేయడం, ఆ భూములకు సంబంధించి రైతులకు నోటీస్ ద్వారా తెలియజేసి వారి సమక్షంలో చూపించిన హద్దుల ప్రకారం కొలతలు తీసుకొని, వాటి విస్తీర్ణం లెక్కించి, వ్యత్యాసాలు ఉంటే వారికి 9(2) నోటీసు



ద్వారా తెలిజేయాలని సూచించారు. విస్తీర్ణంలో ఏవైనా తేడాలు ఉంటే అప్పీలును స్వీకరించి, వాటిని మొబైల్ మెసేజ్ ద్వారా విచారించి వారు చేసుకున్న అప్పీల్‌ను సకాలంలో పరిష్కారం చేస్తామన్నారు. గ్రామాలకు సంబంధించి డ్రాఫ్ ల్యాండ్ రిజిస్టర్ తయారుచేసిన పిదప గ్రామ సభ పెట్టి, డీఎల్ఆర్ చదివి వినిపించి వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే అవి స్వీకరించి, పరిష్కరించి ఫైనల్ ల్యాండ్ రిజిస్టర్ తయారుచేయాలన్నారు. రైతులకు సంబంధించిన భూములను ఈ నెల 20వ తేదీన ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాలంతా భాగస్వామ్యం కావాలి

చిలకలూరిపేట : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పట్టణ కమిషనర్ హరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. స్థానిక నరసరావుపేట సెంటర్లో ఈ కార్యక్రమాన్ని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారని చెప్పారు. చిలకలూరిపేట పట్టణాన్ని అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉదయం 9 గంటలకు ఎన్.ఆర్.టి. సెంటర్ వద్ద కార్యక్రమం చేపడతామన్నారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు.



మాట్లాడుతున్న కమిషనర్ హరిబాబు



వేధిస్తున్న రెవెన్యూ సిబ్బంది కొరత

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతి తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో సకాలంలో పనులు అవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామస్థాయిలో కీలకమైన వీఆర్వో పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. మండలంలో మొత్తం 16 మంది వీఆర్వోలు విధులు నిర్వర్తించాల్సి ఉండగా.. కేవలం తొమ్మిది మంది మాత్రమే ఉన్నారు. ఒక్కొక్కరికీ అదనపు బాధ్యతలు పడుతున్నాయి. ఫలితంగా పని భారంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని ప్రజలు కూడా ఏ గ్రామానికి ఎవరు వీఆర్వోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారో అర్థం కాక, అయోమయానికి గురవుతున్నారు. తమ పని కోసం ఎవరికి చెప్పుకోవాలో తెలియక, తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రతి రోజూ తిరుగుతున్నారు. కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఫలితంగా రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారంలో ఆలస్యమవుతోందని ప్రజలు చెబుతున్నారు.



ప్రమాదకరంగా రహదారి

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రహదారి ప్రమాదకరంగా మారింది. మొత్తం గుంతలు పడటంతో రాకపోకలకు స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేగంగా వస్తున్న వారు ఇక్కడ గోతులను గమనించక, తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారి మరమ్మతులకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

ఈ నెల 19 నుంచి యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్‌పివై వ్యవస్థాపకులు సైదయ్య ఆచార్య శుక్రవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు పట్టణంలోని ఇష్టకామేశ్వరి వీరభద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కోర్సు 9 రోజులు పాటు కొనసాగుతుందని తెలిపారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి -దాచేపల్లి

కిమ్స్ శిఖర హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 19న పల్నాడు జిల్లా గురజాల పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఉదయం 9 గంటలకు ఉచిత మెగా వైద్యశిబిరం ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గుండె, మెదడు, నరాలు, పక్షవాతం, జీర్ణకోశ, ఊపిరితిత్తులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్లు, చిన్నపిల్లల వ్యాధులు, స్త్రీ, ప్రసూతి వ్యాధులతోపాటు ఇతర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలి

- మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని.. ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పల్నాడు జిల్లా యువజన విభాగం నూతన అధ్యక్షుడిగా నియమితులైన కందుల శ్రీకాంత్ శుక్రవారం మాజీ మంత్రి రజినిని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ విషయంలో యువజన విభాగం కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తామని చెప్పారు. ప్రజలకు అండగా ఉంటామన్నారు. తనను నమ్మి, పదవి వచ్చేలా చేసిన మాజీ మంత్రి విడ దల రజినికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. శ్రీకాంత్‌ను అభినందించారు.



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న రజిని, ఇతర నాయకులు

21న మాచర్లలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - మాచర్ల

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన కార్యాలయం, సీడాప్ అధ్వర్యంలో ఈ నెల 21న మాచర్ల పట్టణంలోని ఎస్కేబిఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు శుక్రవారం తెలిపారు. ఈ జాబ్ మేళాకు శ్రీరామ్ ఫైనాన్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ముతూట్ ఫిన్ కార్ప్, ఎయిర్టెల్ పేమెంట్ బ్యాంక్, హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీలు హాజరవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్హతను బట్టి నెలవారీ వేతనం సుమారు రూ.14,500 నుంచి రూ.35,000 వరకు ఉండవచ్చని తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌కు ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసి, పి.జి విద్యార్హతల గలవారు హాజరు కావచ్చని సూచించారు. వయస్సు 18–35 సంవత్సరాల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, జిరాక్స్ కాపీలతో నేరుగా ఇంటర్వ్యూ ప్రాంగణానికి హాజరు కావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 78427 47682, 90105 85360 నంబర్లను సంప్రదించాలని తకోరారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది..'

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ మండలం నాగిరెడ్డి పాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కంది, మిరప పంటలను, వరి నారు మడులను వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య నారులో పాటించాల్సిన మెలకువలను వివరించారు. వరి నారు మడిలో చీడ.. ప్రధాన పంటలోకి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. సకాలంలో నివారణ మందును పిచికారీ చేయడం వల్ల పంటను తెగుళ్ల బారిన పడకుండా రక్షించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు నెకరికంటి అయ్యప్ప, రైతులు పాల్గొన్నారు.



ముస్లిముల సంక్షేమానికి పెద్దపీట : ఎంపీ

ప్రజాశక్తి -దాచేపల్లి

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణదేవరాయలు చెప్పారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని గామాలపాడు గ్రామ శివారు మసీద్ వద్ద శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని మదర్సా ఇస్లాహుల్ బనాత్ బాలికల అరబిక్ పాఠశాలలో ఆలిం కోర్స్ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీతోపాటు.. శాసనమండలి సభ్యులు, టి.టి.డి పాలకమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింల కోసం ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు కోరారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించి, వారికి సర్టిఫికెట్లను ముఖ్య అతిథులు చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇండిపెండెంట్ కౌన్సిలర్ షేక్ షరీఫ్, తిరుమల శెట్టి ఆంజనేయులు, ముస్తఫా, ఫారుక్, యూసుఫ్ మౌలానా పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీ

మహిళ ఫిర్యాదు మేరకు ఒకరి అరెస్ట్

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన మన్నవ లూర్దు రాజును పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపారు. ఈ నెల 11వ తేదీన అదే గ్రామానికి చెందిన కాకర్ల పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంక్రాంతికి.. గుంతలే స్వాగతించాయ్!

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

సంక్రాంతి పండగకు ఊరొచ్చిన వారికి గుంతలు లేని రహదారులు స్వాగతం పలుకుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఒక వేళ రోడ్లు పడకపోతే ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేదే బాధ్యతని తెలిపారు. సంక్రాంతి పండగైతే వచ్చింది, వెళ్లింది గానీ.. రహదారులు మాత్రం దుమ్మూధూళి, గుంతలతోనే దర్శనమిచ్చాయి. పండగకు వచ్చేవారికి ప్రమాదాలతో స్వాగతం పలికాయి. ఏ ప్రభుత్వం మారినా.. తమ ఊరి రోడ్లు మాత్ర మారవని.. ఇటుగా ప్రయాణమంటేనే భయం వేస్తోందని సొంతూళ్లకు వచ్చేవారు చెబుతున్నారు. ప్రత్తిపాడు–కొండ్రుపాడు రహదారి మరింత అధ్వానంగా మారింది. పూర్తిగా రాళ్లు లేచాయి. ఈ రోడ్డులో ప్రయాణించడం వల్ల ద్విచక్ర వాహనాలు తరచూ మొరాయిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతుకుల రోడ్లలో పెద్దవారు, రోగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొర పెట్టుకుంటున్నా ఫలితం ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా మార్పు రాలేదని అంటున్నారు.



పూర్తిగా రాళ్లు తేలి.. ప్రయాణించడానికి కష్టంగా మారిన కోండ్రుపాడు రహదారి

ప్రజలపై టోల్ బాదుడు తగదు

ప్రజాశక్తి-మంగళగిరి



వాహనదారులపై అదనపు భారం మోపే విధంగా కేంద్ర ప్రభుత్వం టోల్ ప్లాజా రేట్లను పెంచుతూ జీవో విడుదల చేయడాన్ని సీపీఎం సీనియర్ నాయకులు జె.వి. రాఘవులు శుక్రవారం తీవ్రంగా ఖండించారు. గతంలో నాలుగు చక్రాల వాహనదారులు ఒక్కసారి తీసుకున్న టిక్కెట్టుపై 24 గంటలు సమయం ఉన్న విధానాన్ని మారుస్తూ.. సింగల్ ట్రిప్‌గా మార్చడం వల్ల ప్రయాణికులపై తీవ్ర భారం పడుతోందని తెలిపారు. రాష్ట్రంలో 69 టోల్ ప్లాజాలు ఉండగా.. ప్రస్తుతం 65 టోల్ ప్లాజాలకు సింగల్ ఎంట్రీ విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. అద్దె, సొంత వాహనదారులకు నెలవారి పాసులు పొందే విధానాన్ని రద్దు చేస్తూ.. ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు రుసుములు చెల్లించే విధానాన్ని అమలు చేయడం వల్ల, వారి జీవన ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్టేట్ హైవేలు, జిల్లా హైవేలకు టోల్ టాక్స్ విధానాన్ని అమలు చేసే విధంగా ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజలపై అధిక భారాన్ని మోపుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టోల్ పేరుతో ప్రజల సొమ్మును కాంట్రాక్టర్లకు దోచిపెట్టే విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

రాజధానిలో పొలం విక్రయం పేరిట మోసం

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్ర రాజధాని ప్రాంతమైన అమరావతిలో పొలం విక్రయిస్తామని నమ్మించి మోసగించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక ఐతానగర్‌కు చెందిన నక్కా కృష్ణ, అతని కుమారుడు శివకుమార్, కుమార్తె మంచాల మహాలక్ష్మిలు సేలంకు చెందిన జయరాజ్‌కు పొలం విక్రయిస్తామని చెప్పారు. రాజధాని ప్రాంతంలో పొలం ఉందని 2023 నుంచి విడతల వారీగా రూ.86 లక్షలు తీసుకున్నారు. రెండేళ్లు గడుస్తున్నా పొలం విక్రయించకపోవడంతో మోసపోయానని గ్రహించి బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



శ్మశానవాటిక ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మంగళగిరి

శ్మశాన వాటిక ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ కోరారు. ఈ మేరకు గుంటూరు కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసినట్లు శుక్రవారం తెలిపారు. స్థానిక శ్మశాన వాటిక స్థలాన్ని ఇటీవల కాలంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన యేళ్ల జయలక్ష్మి, ఆమె కుమారుడు, మద్దతుదారులు ఆక్రమణ చేశారని.. అడిగిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్, కట్టేపోగు బాబురావు, మురికిపూడి కన్నా, కొమరాల శ్రీనివాసరావు మాదిగ, నవీన్ మాదిగ, కొమ్ము ఆనంద్ మాదిగ, చిలువూరు హనుమంతరావు మాదిగ, కనపాల బాజీ మాదిగ, శంగారపాటి మోజేష్ పాల్గొన్నారు.

అమరావతిలో గణతంత్ర వేడుకలు లేనట్లే..

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో గణతంత్ర వేడుకలు లేనట్లే.. రాజధానిలో సందడి కనిపించేలా రాష్ట్ర స్థాయి వేడుకలు నిర్వహిస్తే బాగుంటుందని భావించిన ప్రభుత్వం.. రాజధానిలో 76వ గణతంత్ర వేడుకల నిర్వహణకు అనువైన స్థలాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించింది. దీంతో గత నవంబర్ 27న సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి సురేష్ కుమార్ తదితరులు అమరావతిలో స్థల పరిశీలన చేశారు. రాయపూడిలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయానికి సమీపంలో ఎన్ఆర్‌టి (నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ)ఐకాన్ టవర్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. దీంతో పంచాయతీ అధికారులు ఆ స్థలంలో పెరిగిన పనికిరాని మొక్కలను తొలగించి, భూమిని చదును చేశారు. కొంత తర్జనభర్జనల అనంతరం ఆ ప్రాంతం వేడుకలకు అనుకూలంగా లేదని భావించిన ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకుంది.

ఎట్టకేలకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రిపబ్లిక్ వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో అమరావతిలో రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవం లేనట్లేనని స్పష్టమైంది.

కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడాలి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

న్యాయబద్ధంగా తమకు రావలసిన నష్టపరిహారం కోసం పోరాటం చేస్తున్న ఏసీసీ కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఏసీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు 45వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలను ఉద్దేశించి దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికుల పట్ల ఏ పాలకపక్షానికైనా నిర్లక్ష్య ధోరణి ఉండకూడదని చెప్పారు. గత ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. ఏఐఎఫ్‌టియు నాయకులు ఆదినారాయణ మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానంలో ఎసిసి కార్మికులకు ఇచ్చిన మాటను మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని కోరారు. ఏసీసీ కార్మిక పోరాట కమిటీ కన్వీనర్



కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ చట్ట ప్రకారం ఏసీసీ కార్మికులకు యాజమాన్యం నష్టపరిహారం అందించే వరకు న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దీక్షల్లో తుపాకుల దుర్గ భవానీ, ఈదులముడి శారమ్మ, బళ్లా శివకుమారి, ఎస్‌కే మాలిం, కరీం, నిష తదితరులు కూర్చొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ : కమిషనర్

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం మంగళగిరి గాలి గోపురం నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎస్.ఆలిం బాషా తెలిపారు. బ్లీచింగ్, దోమల నివారణ, డంప్‌ల తొలగింపు, మొక్కల పెంపకం, గార్బేజ్ డంప్‌లను శుభ్రపర్చడం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

స్వచ్ఛత లక్ష్యంగా కార్యక్రమాలు..

చేబ్రోలు : ప్రతి నెలా మూడో శనివారం గ్రామాల్లో స్వచ్ఛ దివస్‌లో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.లలిత తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, ప్రజారోగ్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని సూచించారు.



సీఆర్‌డీఏ గ్రీవెన్స్‌డేకు 38 వినతులు

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో రాజధాని ప్రాంత రైతులు, రైతు కూలీల నుంచి అధికారులకు వివిధ సమస్యలపై 38 ఫిర్యాదులు అందాయి. ఇందులో కేవలం భూమి వ్యవహారాలకు సంబంధించినవే 37, ప్రణాళికా విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యేలా ఉప కలెక్టర్లు, ఇతర అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పరిష్కారానికి వీలున్నవాటిపై తక్షణం దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపకలెక్టర్లు కె.స్వర్ణమేరి, పి.పద్మావతి, జి.రవీందర్, ఎ.జి.చిన్నికష్ణ, బి.సాయిశ్రీనివాస్‌నాయక్, సామాజిక అభివృద్ధి విభాగం డీసీడీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజధాని ప్రాంతంలో శరవేగంగా సాగుతున్న పనులు

- నిర్మాణాల మధ్యలో పెద్ద ఎత్తున నిల్వ ఉన్న నీరు
- మోటార్ల ద్వారా తోడి, బయటకు పంపుతున్న సిబ్బంది

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో శాశ్వత సచివాలయం, హైకోర్టు భవనాల పునాదులలో నిలిచిపోయిన నీటిని తోడే ప్రక్రియ కొనసాగుతోంది. 2019 ఎన్నికల ముందు ఇక్కడ శాశ్వత సచివాలయం, హైకోర్టు భవనాల నిర్మాణం నిలిచిపోయిన విషయం విదితమే. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో నిర్మాణాలను పట్టించుకోలేదు. దీంతో భవనాల పునాదుల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. సచివాలయం, హైకోర్టు పునాదుల వద్ద సుమారు ఎనిమిది మీటర్ల లోతున నీరు నిల్వ ఉంది. ఇనుప చువ్వలు, స్తంభాలు ఏళ్ల తరబడి నానుతూ తుప్పుపట్టాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయం, హైకోర్టు, హెచ్‌వోడీ భవనాల ప్రస్తుత స్థితి ఏ విధంగా ఉందో పరిశీలించింది. భవనాల సామర్థ్యంపై పరిశీలన జరిపేందుకు చెన్నై, హైదరాబాద్ ఐఐటి నిపుణుల బృందాన్ని రంగంలోకి దింపిన విషయం తెలిసిందే. బృంద సభ్యులు గతేడాది ఆగస్టులో భవనాలను పరిశీలించారు. ఎస్‌డిఆర్ఎఫ్ సాయంతో పడవలలో ప్రయాణించి భవనాల పునాదుల పటిష్టత, సామర్థ్యం ఏ విధంగా ఉందోనని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. భవనాల పునాదులు దెబ్బతినలేదని, పటిష్టంగానే ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టి సారించింది. ఇందుకనుగుణంగా సచివాలయం, హైకోర్టు భవనాల పునాదులలోకి భారీగా చేరిన నీటిని తోడివేసే పనికి శ్రీకారం చుట్టింది.

సుమారు నెల రోజులుగా..

డిసెంబర్ 25న సచివాలయ టవర్లకు వేసిన ర్యాఫ్ట్ ఫౌండేషన్ వద్ద నీటిని తోడేసే ప్రక్రియ మొదలైంది. పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లను తెచ్చి వాటికి అమర్చిన ఇంజన్లతో నీటిని తోడుతున్నారు. రోజుకు 12 గంటలపాటు నీటిని తోడి, పాలవాగు ద్వారా కృష్ణానదిలోకి పంపిస్తున్నారు. ఈ ప్రక్రియ మరికొద్ది రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నీటిని పూర్తిగా తోడివేసిన తరువాత మరోసారి ఐఐటి నిపుణుల బృందం పునాదుల పటిష్టత, సామర్థ్యం తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తుందని అధికారులు తెలిపారు.



మోటార్ల ద్వారా నీటిని తోడి, మరోచోటకు వదులుతున్న దృశ్యం

శేషమాంబకు 'తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం'

ప్రజాశక్తి-గుంటూరు



శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ ఎకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరమ్, వరల్డ్ పొయిట్రి అకడమీ సంయుక్తంగా అందించే 'తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం'కు గుంటూరుకు చెందిన రచయిత్రి చుండూరు శేషమాంబ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆమె అధికారిక ఆహ్వానపత్రాన్ని అందుకున్నారు. తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్యరంగానికి ఆమె చేస్తున్న కృషిని గుర్తించి ప్రతిభా పురస్కారం ప్రకటించారు. ఈనెల 21వ తేదీ విజయవాడలోని శ్రీ కౌత పూర్ణానంద్ విలాస్ కళావేదికలో పురస్కారం ప్రదానం జరగనున్నది. పురస్కారానికి ఎంపిక చేసిందుకుగాను శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతికి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణంకు ధన్యవాదాలు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఏ నశీర్, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

జిజిహెచ్‌లో వెల్నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం వెల్నెస్ క్లినిక్స్‌ను ఎమ్మెల్యే నశీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ వెల్నెస్ క్లినిక్స్ వారంలో రెండు రోజులు సోమవారం, బుధవారం ఓపి నెంబర్ మూడు లో అందుబాటులో ఉంటాయన్నారు. పలు వార్డులను ఎమ్మెల్యే నశీర్ పరిశీలించారు. వెల్నెస్ విభాగంలోని ఒపిని ప్రివెంటివ్ మెడిసిన్ డిపార్ట్మెంట్ వైద్యులు డైటీషియన్స్ మరియు నర్సింగ్ సిబ్బంది నిర్వహిస్తారు. జీవనశైలి మార్పులు వస్తున్న వివిధ రకాల వ్యాధులు ఉదాహరణకి బీపీ షుగర్ గుండె జబ్బులు, కిడ్నీ జబ్బులు ముందుగానే గుర్తించి నివారించడానికి ఇక్కడ ప్రత్యేక ఓపెన్ నిర్వహిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. శాసనసభ్యులు మొహమ్మద్ నశీర్, ఆరో డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, హెచ్ డి ఎస్ మెంబర్ అయిన డాక్టర్ సెనక్కాయల ఉమా శంకర్, డాక్టర్ సీతారామన్, డాక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



రవాణా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎస్ పి సతీష్ కుమార్

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోడ్డు ప్రమాదాల నివారణ ఈనెల 16 నుంచి వచ్చే నెల 15 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు - 2025 నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. ఈనెల 16వ తేదీ నుండి ఫిబ్రవరి 15వ తేదీ వరకు "శ్రద్ధ వహించండి" అనే నినాదంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన రవాణ, ఆరోగ్యశాఖ అధికారుల సమావేశంలో ఎస్‌పి సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, నిబంధనలు పాటించడం, రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘించిన వారిపై అపరాధ రుసుము విధించడం, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ప్రజలకు నగదు రహిత వైద్య సహాయం అందించేందుకు కషి చేయడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పోలీస్ రవాణా శాఖలో సమన్వయంతో కషి చేయాలని ఈ సందర్భంగా ఎస్‌పి కోరారు. వాహనదారులు, జాతీయ రహదారుల మీద ప్రయాణించేటప్పుడు అప్రమత్తతగా ఉండాలన్నారు. వీలైనంత వరకు సర్వీస్ రోడ్డు ఉపయోగించుట, హెల్మెట్ ధరించుట మొదలగు వివిధ అంశాలకు సంబంధించి అవగాహన కలిగి ఉంటే వారు రోడ్డు ప్రమాదాల భారిన పడే అవకాశం ఉండదని కావున వాహనదారులకు అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తీర్మానించారు. రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తూ రోడ్డు ప్రమాదంలో వ్యక్తుల మరణాలకు కారణమైన వారు, మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, వాహనాలకు పెద్ద శబ్దాలు కలిగిన సైలెన్సర్లను బిగించి ప్రమాదకర రీతిలో వాహనాలు నడపడం తదితరులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత వాహన దారులకు లైసెన్సును వాహన చట్టాల ప్రకారం మూడు నెలలు సస్పెండ్ చేయడం జరుగుతుందని వాహనదారులకు తెలియజెప్పాలని పోలీస్ రవాణా అధికారులు నిర్ణయించారు. సమావేశంలో డిటిసి సీతారామిరెడ్డి, అదనపు ఎస్‌పి రమణమూర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయలక్ష్మీ, ట్రాఫిక్ డిఎస్‌పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.294.20 కోట్లతో కృష్ణానదికి మరో రక్షణ గోడ

తాడేపల్లి వద్ద వరద ముంపు నివారణకు చర్యలు - మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం - సుందరయ్య కాలనీ, మహానాడు కాలనీలకు మోక్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాడేపల్లి మండలం తాడేపల్లి గ్రామ పరిధిలో ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణా నదికి కుడి మార్జిన్‌లో 0.9 కిలో మీటరు నుంచి 2.61 కిలో మీటర్ల వరకు వరద రక్షణ గోడ నిర్మాణ పనులకు రూ.294.20 కోట్లతో పరి పాలన అనుమతి మంజూరు చేస్తూ శుక్రవారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ప్రతి ఏడాది వర్షాకాలంలో కృష్ణా నది వరద ఉదతి కారణంగా తాడేపల్లి పరిధిలోని సుందరయ్య నగర్, మహానాడు కాలనీ తదితర ప్రాంతాలు ముంపునకు గురై బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వరద సమ యంలో ఈ ముంపు ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక పునరావాస కార్యక్రమాలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత ఏడాది ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు నాలుగో తేదీ మధ్య కురిసిన అధిక వర్షాలు, ఎగువ నుంచి వచ్చిన భారీ వరదతో ప్రకాశం బ్యారేజికి 11.43 లక్షల క్యూసెక్కుల నీరు రావడంతో మహానాడు, సుందరయ్యనగర్ కాలనీలు ముంపునకు గురయ్యాయి. గత ప్రభుత్వ హయంలో విజయవాడ వద్ద కృష్ణా నది ఎడమవైపు మార్జిన్‌లో వరద రక్షణ గోడను నిర్మించడం వల్ల గత ఏడాది సెప్టెంబరులో కృష్ణా నది వరద సమయంలో 11.43 లక్షల క్యూసిక్కుల వరద ప్రవాహం వచ్చినప్పటికీ కృష్ణ లంక, రాణీగారి తోట తదితర పల్లపు ప్రాంతాలు ముంపుకు గురి కాకుండా ప్రజలు సురక్షితంగా బయటపడ్డారు. ఈ నేపథ్యంలో తాడేపల్లి మండలంలో ముంపు సమస్య ఎదుర్కొంటున్న మహానాడు, సుంద రయ్య నగర్ వాసులకు తరచూ ఏర్పడు తున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.294.20 కోట్ల అంచనాలతో శాశ్వత రక్షణ గోడ నిర్మాణంకు ఎట్టకేలకు మంత్రి వర్గం ఆమో దం తెలిపింది. ఎంతోకాలంగా శాశ్వత ప్రాతి పదికన వరద రక్షణ గోడను నిర్మించాలని తాడే పల్లి పరిధిలోని సుందరయ్య నగర్, మహానాడు కాలనీ తదితర పల్లపు ప్రాంతాల ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు కూటమి ప్రభుత్వం స్పందించి ఈ వరద రక్షణ గోడ నిర్మాణానికి ఆమోదం తెల్పింది. అలాగే కృష్ణానదికి రాజధాని వైపు ఇబ్రహీంపట్నం నుంచి ప్రకాశం బ్యారేజి వరకు కూడా రక్షణ గోడ నిర్మించాలని రాజధాని వాసులు కోరు తున్నారు. ప్రధానంగా తుళ్లూరు మండలం రాయపూడి, తాళ్లాయపాలెం, ఉద్దండ్రాయు నిపాలెం, లింగాయపాలెం, వెంకటపాలెం, ఉండవల్లి వద్ద తరచూ వరద ప్రభావంతో రాజధాని గ్రామాల్లోకి వరద నీరు వస్తోంది. గత ఏడాది సెప్టెంబరులో సిఎం నివాసంతోపాటు కరకట్ట వెంబడి ఉన్న నిర్మాణాలన్నీ కూడా దాదాపు 10 రోజులపాటు నీటిలోనే ఉండిపోయాయి. ఈ ప్రాంతంలో కూడా ముంపు నివారణకు చర్యలు చేపట్టాలని రాజధాని వాసులు కోరుతున్నారు.



ముంపునకు గురైన తాడేపల్లి మహానాడు, సుందరయ్యనగర్ (ఫైల్‌ఫొటో)





సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, హాజరైన నగరంలోని సీనియర్ సిటిజన్లు

నగరాభివృద్ధికి సీనియర్ సిటిజన్స్ సలహాలు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరాభివృద్ధికి సీనియర్ సిటిజన్స్ సూచనలు సలహాలు ఎంతో దోహదపడతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్‌తో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ వివిధ రంగాలలో ఎంతో అనుభవం సాధించి ఉంటారని, అటువంటి వారి సూచనలు సలహాలు ఎంతగానో అవసరమన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, పార్కులు, డివైడర్ల నిర్వహణ వంటి అంశాలపై నిర్మాణాత్మకమైన సూచనలు అందించాలని కోరారు. సీనియర్ సిటిజన్స్, జియంసి అధికారులతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, గ్రూప్‌లో తమ అభిప్రాయాల్ని పోస్ట్ చేయవచ్చన్నారు. అనంతరం పలువురు సీనియర్ సిటిజన్స్ మాట్లాడుతూ నగరంలో వార్డు అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేయాలని, సుదీర్ఘ కాలంనుండి అసంపూర్తిగా ఉన్న నార్ల ఆడిటోరియం పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని, గోరంట్ల కొండపై రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, తాగునీటి రిజర్వాయర్ల వద్ద వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలని, శంకరవిలాస్ ఆర్‌ఓబి నిర్మాణ పనులు ప్రారంభానికి ముందే రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి వార్డులో సీనియర్ సిటిజన్స్‌కు కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటి కమిషనర్ సి.హెచ్ శ్రీనివాసరావు, యస్.ఈ నాగమల్లేశ్వర రావు, సి.పి రాంబాబు, సి.యం.ఓ.హెచ్ డాక్టర్ అమృతం, పి.ఓ రామారావు, ఎ.డి.హెచ్ శ్రీనివాసరావు సీనియర్ సిటిజన్స్ నూతలపాటి తిరపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు : రోడ్డు భద్రతా మాసంలో భాగంగా గుంటూరు ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ద్విచక్రవాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు వంద మంది వాహనదారులు హెల్మెట్ ధరించటం అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యత గురించి, ద్విచక్ర వాహనదారులలో అవగాహన, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోటారు వాహనంతో ప్రమాదానికి గురైన బాధితుడి జీవితాన్ని రక్షించిన గుడ్ సమరిటన్‌కు అవార్డుల మంజూరు కోసం పథకం గురించి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రవాణాశాఖ అధికారి బి.సత్యనారాయణ ప్రసాద్, గుంటూరు మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు గోపాల్, మల్లేశ్వరి, జి.సౌజన్య, ఏఎంవిఐ సంధ్య, ఎన్‌జిఒ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 238 మందికి అర్హత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం కొనసాగాయి. స్థానిక పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ పరీక్షలకు 440 మంది హాజరు కాగా వారిలో 83 మంది సంబంధిత ధ్రువ పత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. మిగిలిన 357 మంది అభ్యర్థులకు శరీర కొలతల పరీక్షలు నిర్వహించగా వారిలో 42 మంది అనర్హులయ్యారు. మిగిలిన 315 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 40 మంది అనర్హులు కాగా 275 మంది తదుపరి పరీక్షల కొరకు అర్హత సాధించారు. వీరిలో 274 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఒకరు మధ్యలో నిష్క్రమించారు. 111 మంది అనర్హులుగా నిర్ధారించారు. మొత్తం అన్ని పరీక్షల్లో 357 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా వారిలో 263 మంది అర్హత సాధించగా, 94 మంది అనర్హతకు గురయ్యారు. కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల నిర్వహణ తీరును ఎస్‌పి సతీష్‌కుమార్, అదనపు ఎస్‌పిలు సుప్రజ, రమణ మూర్తి తదితరులు పరిశీ లించారు.



పరుగు పందెంకు హాజరైన అభ్యర్థులు